కర్నూలు | నంద్యాల
వార్త
30 జూన్ 2026 మంగళవారం పేజీలు 4

# ఓటరు జాబితా సవరణపై టీడీపీ పార్లమెంట్ స్థాయి సమావేశం

**కర్నూల్ హాస్పిటల్ జూన్ 29 ప్రభాతవార్త:**
కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన సోమవారం కర్నూలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాల్సిన అవసరంపై నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో ఆదోని నియోజకవర్గ ఇంచార్జి కె. మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్, బి.పి. బసవరాజు, కె. రంగన్న, జి. అశోక్ యాదవ్, అధికార ప్రతినిధులు బోయ మధుసూదన్ నాయుడు, వెంకట కృష్ణ నాయుడు, బందె నవాజ్, కార్యనిర్వాహక కార్యదర్శులు షేక్ జకియా అక్సారి, కె. అక్షయ కుమారి, అబ్దుల్ సుభాన్, కార్యదర్శులు పి. సుభాన్ బీ, జిక్రియా బాషా, గద్దం హేమావతి, సంగిపోగుల వీరేష్, మీడియా కోఆర్డినేటర్ ఈ. మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే
- ఈకేవైసీ పూర్తి చేసిన రైతులకు జూలైలో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- పీజీఆర్ఎస్ సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు
- ప్రతి అర్జీకి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు

**బనగానపల్లె, జూన్ 29 ప్రభాతవార్త:**
ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి త్వరితగతిన పరిష్కరించాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలంటే ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సోమవారం బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఒక్కో వినతిని స్వయంగా పరిశీలించిన ఆయన, సమస్యల స్వరూపాన్ని తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వ సేవలు అందించాలని, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో ఈకేవైసీ పూర్తి చేసిన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీని జూలై నెలలో చేపడతామని తెలిపారు. మండలంలోని అప్పలాపురం, కాపులపల్లె గ్రామాల రైతులకు మొదటి దశలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన రైతులు అవసరమైన ధ్రువపత్రాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజల నుంచి అందిన వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి, వాటిపై తీసుకునే చర్యల వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబు దారీతనం పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె ఆర్డీవో నరేంద్రనాథ్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, డీఎల్ఐ చంద్రశేఖర్, ఎంపీడీవో నాగరాజు, మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, డిప్యూటీ ఎంపీడీవోలు తిరుమలేశ్వర్ రెడ్డి, సురేంద్రనాథ్ యాదవ్, మండల సర్వేయర్ మురళి, ఎంఏహెచ్‌వో డాక్టర్ బి. శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏఈలు శ్రీనివాసులు, గజప్ప, ఎంఈఓ-1 స్వరూప, ఎంఈఓ-2 శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఏపీఓ రమణ, ఏపీఎం హజరత్ తదితర వివిధ శాఖల అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# పైసలు లేవు..పవర్ లేదు..!

- రైతు కన్నీళ్ళను పట్టించుకొని కరెంటోళ్లు
- ఒకరిపై ఒక అధికారి మాట దాటవేత..!



**లంచం ఇస్తేనే కరెంటు ఇస్తాము..?**
నందవరం మండలం పూలచింతలో విద్యుత్‌శాఖ తీరు చుస్తే అదే నిజమనిపిస్తోంది. ఖరీఫ్ విత్తనాలు వేసి నెలరోజులు దాటినా పొలాలకు కరెంటు సరఫరా లేక రైతులు గగ్గొలు పెడుతున్నారు. మే 29న వచ్చిన అకాల వర్షం ఈదురు గాలులకు గ్రామంలో విద్యుత్ స్థంబాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. అప్పటి నుంచి చీకటి రాజ్యం ఏలుతుంది. బోరుబావులపై అధారపడ్డ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**నందవరం, జూన్ 29, ప్రభాతవార్త:**
పైసలు ఇస్తేనే పవర్ ఇస్తామంటూన్నారు. వరుణుడు కరుణించలేదు, కరెంటోళ్లు కనికరించడం లేద. కళ్ళముందే పంట ఎండిపోతుంటే గుండె తరుక్కుపోతుంది. అని రైతు కురువ వీరేష్ వార్త ప్రతినిధి ముందు బోరుమన్నారు. నెలరోజులుగా అధికారుల చుట్టు తిరుగుతున్నా నా మొర అలకించే నాథుడు లేరని వాపోయారు. రైతు కురువ వీరేష్ లాంటి వారి కన్నీళ్లు అరకముందే విద్యుత్ శాఖ మేల్కోనాలి. లేకపోతే ఈ ఖరీఫ్ రైతులకు శాపంగా మారుతుంది. జిల్లా కలెక్టర్, ఎస్ఈ స్థాయి అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. అధికారుల దాటవేత దీనిపై లైన్‌మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ రావడం లేదు, మా చేతుల్లో ఏమిలేదు మీరు ఏఈ సారు చెప్పుకోండి అని చేతులెత్తేశారు. ఇంచార్జీ ఏఈ సుబ్బారెడ్డి మాత్రం నాకేమి తెలియదు. రైతును నాదగ్గరకు పంపకండి అంటూ బాధ్యత నుండి తప్పుకున్నారు. ఒకరినొకరు చూపించుకుంటూ రైతులను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువేత్తుతున్నాయి.



## ప్రజలకు సేవలు సులభంగా అందాలి

– నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు మున్సిపల్, జూన్ 29, ప్రభాతవార్త:**
నగరపాలక సేవలు ప్రజలకు సులభంగా అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు సంబంధించిన 17 ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్యధికారి డా.ఎం రఘు, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్‌రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ ఉద్యోగి విధుల నుంచి తొలగింపు

**మంత్రాలయం, జూన్ 29, ప్రభాతవార్త;**
మండల పరిధిలోని మాధవరం అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న మైనింగ్ ఉద్యోగిని ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారులు ఈ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. వివరాల మేరకు.... గుండుపోగుల రవి అనే మైనింగ్ ఉద్యోగి గత కొంతకాలంగా చెక్‌పోస్టు మీదుగా కర్ణాటక నుంచి మన ప్రాంతానికి ఇసుక, గరుసు, సిమెంట్, సిమెంట్ బ్రిక్స్, రాళ్లు, ఐరన్ మెటీరియల్ తదితర మెటీరియల్ వస్తూ ఉంటాయి. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటన్నిటికీ బిల్లులు చూసి ప్రభుత్వానికి చలానా కట్టించుకోవాలి. కానీ ఈ ఉద్యోగి మాత్రం వాహనదారులతో డబ్బులు లంచంగా తీసుకుని వాహనాలను వదిలినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఉద్యోగి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించడంతో ఈ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు.



# ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం : ఎమ్మెల్యే

**ఆదోని జూన్ 29 ప్రభాతవార్త :**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారం చూపాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజల కోసం.. మీ పార్థసారథి" కార్యక్రమంలో భాగంగా ఆదోని పట్టణంలోని భావజీపేట ప్రాంతంలో ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి సోమవారం ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మహిళలకు అవసరమైన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, రోడ్ల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు, అలాగే ఇంటి పట్టాలు లేని కుటుంబాలకు కూడా ఇంటి నీటి కొళాయి కనెక్షన్లు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల వినతులపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డా. పార్థసారథి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి, సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నహీమ్ అహ్మద్ , మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు తిమ్మప్ప, బీజేపీ మాజీ కౌన్సిలర్ సురేష్, ముని, రామాంజి, జనసేన నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## శ్వాసక్తితో.. ఎదగడం సంతోషకరం

**: ఎమ్మెల్యే కోట్ల జై సూర్య ప్రకాష్ రెడ్డి**
**డోన్ జూన్ 29 ప్రభాతవార్త**
ఉద్యోగం మీద ఆధారపడకుండా శ్వాసక్తితో ఎదగడం సంతోషకరమని డోన్ ఎమ్మెల్యే కోట్లజై సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు సోమవారం మండల పరిధిలోని జగదుర్తి బస్ స్టేజి జాతీయ రహదారి పక్కన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర నయారా పెట్రోల్ బంక్ ను యజమానులు వడ్డే శ్రీనివాసులు ఎం నాగేంద్రులు పిలుపుమేరకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు శ్వాసక్తితో ఎదగడమే కాకుండా దాదాపు పదిమందికి ఉపాధి కల్పించడం చాలా గర్వంగా ఉందని పేర్కొన్నారు అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం అవనందినీయమని అన్నారు పెట్రోల్ బంక్ ద్వారా ఇంధన సేవలు మరింత సులభంగా అందడంతో పాటు ప్రజలకు మరింత అందుబాటులో తేవడం అభినందనీయమన్నారు అదేవిధంగా ముఖ్యంగా నిరుద్యోగులు వివిధ వ్యాపార లావాదేవీలలో పాల్గొని అభివృద్ధి చెందాలని సూచించారు అందుకు నిదర్శనం నాగేంద్ర శ్రీనివాసులు లను గుర్తించుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాకేష్ ఎస్సై గోపాల్ జగదుర్తి ప్రతాప్ రెడ్డి కృష్ణారెడ్డి వడ్డే షేక్షావలి తదితరులు పాల్గొన్నారు



# నంద్యాలలో.. ఘనంగా ఏరువాక పౌర్ణమి

**: వేడుకలు ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రిఎన్ఎండి ఫరూక్**



**నంద్యాల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:**
నంద్యాల పట్టణంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , పాణ్యం ఎమ్మెల్యే మరియు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి , నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులు భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో ఎద్దులతో నాగలి దున్ని సాగు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు సిరిసంపదలను అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా రైతులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, సాగులో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ ఖరీఫ్ సాగు రైతులకు విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , నంద్యాల టిడిపి మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, కళ్యాణ్, సతీష్, లాయర్ బాబు మరియు వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల్లో.. ఎస్.ఐ.ఆర్ డిజిటైజేషన్

**: ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌పై కలెక్టర్ ఆదేశాలు**
**కర్నూలు, జూన్ 29, ప్రభాతవార్త :**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్, పీజీఆర్ఎస్‌తో పాటు పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతి ఆదేశాన్ని, ప్రతి గడువును కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన టైమ్‌టేబుల్ ప్రకారం నివేదికలను నిర్ణీత సమయానికే సమర్పించాలని సూచించారు. జిల్లాలో మ్యాపింగ్ పనులు సంతృప్తికరంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. శనివారంలోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని, ప్రతిరోజూ కనీసం 10 శాతం పురోగతి సాధించేలా ఆర్వోలు, ఏఈఆర్వోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా సానుకూల ప్రజాభిప్రాయం పెంపొందించేలా అన్ని శాఖలు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, సర్వే, గ్రామ సచివాలయాలు, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యాన శాఖ తదితర శాఖలు తమ పనితీరును కనీసం 10 శాతం మెరుగుపరచి ప్రజల సంతృప్తి స్థాయిని 80 శాతానికి పైగా తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సాగునీటి సౌకర్యం ఉన్న భూముల్లో ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలని తెలిపారు. చివరి రోజుల్లో మాత్రమే ఫిర్యాదులను తెరిచి సంబంధం లేని ఎండార్స్‌మెంట్‌లతో మూసివేయడం, క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండా నివేదికలు సమర్పించడం వంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. పీజీఆర్ఎస్, భూ రికార్డుల నిర్వహణలో జిల్లా పనితీరు మెరుగుపడేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. నిర్లక్ష్యంగా పనిచేసే తహసీల్దార్లు, వీఆర్ఓలు తదితర అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైళ్లను వెంటనే సిద్ధం చేయాలని డీఆర్వోను ఆదేశించారు. ప్రతిరోజూ కొత్తగా నమోదయ్యే ఫిర్యాదులు, గడువులో ఉన్న కేసులను అదే రోజు పరిశీలించి సంబంధిత ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత, అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఈఈఆర్వోలు, ఏఈఈఆర్వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి

**: చట్ట పరిదిలో న్యాయం చేస్తామని ప్రజలకు భరోసా..**
**నంద్యాల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి :**
నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీసునీల్ షొరాణ్ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి 105 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.



# తుంగభద్ర నదిలో.. మునిగి రెండు వృషభాలు మృతి

**మంత్రాలయం, జూన్ 29, ప్రభాతవార్త;**
తుంగభద్ర నది నీటిలో మునిగి రెండు వృషభాలు మృతిచెంది, రైతు కుటుంబంలో విషాధచాయలు నింపిన ఘటన మండలకేంద్రమైన మంత్రాలయంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మంత్రాలయం గ్రామానికి చెందిన కురువ సురేష్ అనే రైతు ఏరువాక పండగ సందర్భంగా వృషభాలను రాఘ సుధా ఎదురుగా తుంగభద్ర నది తీరాన పుష్కర ఘాట్‌లోకి స్నానాల కోసం ఎద్దుల బండితో వెళ్లాడు. అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో బండితో సహా రెండు ఎద్దులు నీటిలో మునిగిపోయాయి. దీంతో రెండు వృషభాలు ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందాయి. నీటిలో మునిగిన ఎద్దులను బయటికి తీసుకురావడానికి రైతు సురేష్‌తో పాటు మరి కొంతమంది రైతులు తీవ్ర ప్రయత్నం చేశారు. నదిలో రాళ్ల మధ్య బండి, ఎద్దులు ఇరుక్కుపోవడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో క్షణాల వ్యవధిలోనే రెండు వృషభాలు తన కళ్లు ఎదుటే మృతిచెందడంతో రైతు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం స్థానికులు, మత్స్యకారులు నదిలో వెళ్లి తాడు కట్టి ఎద్దుల బండిని బయటకు తీశారు. పండగ పూట తాము ఎంతో ప్రేమగా చూసుకుంటున్న వృషభాలు మృతిచెందడంతో సురేష్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



# విశాఖ స్టీల్ ప్లాంట్ సంఘటన లో మరణించిన వారికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

: మంత్రి లోకేష్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి..




**కర్నూలు సీటీ, జూన్ 29, ప్రభాతవార్త :** విశాఖ స్టీల్ ప్లాంట్ లో గత నెల 8వ తేదీన జరిగిన ప్రమాదంలో మరణించిన బాధితులకు కోటి రూపాయలు గాయపడిన వారికి 50 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ మునెప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు,ఐ ఎన్ టి సి జిల్లా అధ్యక్షులు బతుకన్న, ఐ ఎఫ్ టు యు జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపాల్ , ఏ ఐ యు టి యు సి జిల్లా కార్యదర్శి నాగన్న,డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం నందు విలేకరుల సమావేశంలో కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల కంటూ పోరాటాలు నిర్వహించి 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు కన్నా చేసేందుకు కుట్ర చేస్తున్నారని విశాఖ సొంతగనులు కేటాయించడంతోపాటు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎంతో కష్టపడి లాభాల్లోస్తున్న సంస్థను ప్రైవేటీకరణ చేయడం ఎందుకు కుట్ర చేయడం సిగ్గుచేటని ఆరోపించారు. కార్మికులు స్టీల్ ప్లాంట్ లో కనీస సౌకర్యాలు లేకపోయి నప్పటికీ ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని అక్కడ ఉన్నటువంటి అధికార యంత్రాంగం సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇలాంటి సంఘటనలను పునరావతమవుతున్నాయని ప్రభుత్వం ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడ ఉన్నటువంటి యంత్రాలు కూడా పాత పద్దాయని కొత్త శాస్త్ర సాంకేతంతో నూతన యంత్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కును ఉత్పత్తి చేసే యంత్రాలు మార్చాలని కార్మికుల డిమాండ్ చేస్తున్న నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇలాంటి సంఘటన జరుగుతున్న వాటిపై అధికారులు దృష్టి కేంద్రీకరించక పోవడం బాధాకరమని అన్నారు. బాధితులను ఆదుకో మంటే మంత్రి లోకేష్ వ్యాఖ్యలు విచారకరం మరణించిన కుటుంబా లను ఆదుకోవాలని కార్మిక నేతలు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తే మీ కుటుంబాల్లో ఎవరు చనిపోలేదు కదా అని ప్రశ్నించడం ఆ వ్యాఖ్యలు చేయడం కార్మికులను అవమానించడమే అని వెంటనే కార్మికులకు క్షమాపణ చెప్పాలని కార్మిక ఐక్య సంఘాల వేదిక డిమాండ్ చేసింది. జులై 3న నిరసన ప్రదర్శనలు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో మరణించిన కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలతో పాటు గాయపడిన వారికి 50 లక్షల రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా అగ్రిమెంట్ ప్రకారం ఆ కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ జులై 3న నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కార్మిక నేతలు తెలిపారు విశాఖ ఫ్యాక్టరీ కి సొంత గనులు కేటాయించడంతోపాటు నూతన యంత్రాలు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, పర్మనెంట్ ఉద్యోగాల నియామకాలు చేపట్టి, ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ విధానంలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్ కృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు నగర అధ్యక్షులు జి చంద్రశేఖర్, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి నర్సింహులు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఏ ఈశ్వర్ కృష్ణారెడ్డి, హోటల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నల్లన, ఐఎఫ్టియు నగర కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# కొట్టాల చెరువు చెంచుగూడెంలో వధువు పెళ్లికి ఆర్థిక సహాయం...!

: మానవత్వం చాటుకున్న ఆత్మకూరు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాం భాష..



**ఆత్మకూరు, జూన్ 29, ప్రభాతవార్త;** పేద కుటుంబంలో ఆపద్బాంధవుడిగా ప్రజాసేవలో ఉంటూ ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో ఆకుల సలాం భాష ముందుకు వెళ్తూ సామాజిక సేవతో ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి చెంచు గిరిజన నూతన వధువుకు తమ తోచినంత సహాయం చేయడమే తమ ఆశయమంటూ సోమవారం మండల పరిధిలోని కొట్టాల చెరువు చెంచుగూడెంలో చెంచు గిరిజన నిరుపేద వివాహ వేడుకలకు హాజరై మానవత దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు పెళ్లింట సంతోషంగా ఉండాలని నవ వధూవరులకు ఆశీర్వదించి తాను సంపాదించిన దానిలో పదిమందికి సహాయం అందించడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నారు నిరుపేద కుటుంబాల చెందిన పేదవారికి వివాహ వేడుకలకు, చదువులకు, ఆరోగ్య పరిస్థితి తో బాధపడుతున్న కుటుంబాలకు చేయూతను అందించి నేను ఉన్నాను అంటూ భరోసా ఆత్మకూరు ప్రతి పేద కుటుంబాలకు ఆపద్బాంధవుడిగా ముందుకెళ్తున్న ఆత్మకూరు కి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి సామాజికవేత ఆకుల సలాం భాష సేవలకు ప్రజలు అభినందనీయం తో ప్రశంసలు కురిపిస్తున్నారు వీరి వెంట సగినేల రవికుమార్ చెంచు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# బసవేశ్వర స్వామి దేవాలయము నూతన ధ్వజస్తంభం ఊరేగింపు..

: పాల్గొన్న దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు
: ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ



**చిప్పగిరి, జూన్ 29, ప్రభాతవార్త :** దైవచింతనతో మోక్షమార్గం సిద్ధిస్తుందని కనుక ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ సూచించారు.మండల పరిధిలోని గుమ్మనూరు గ్రామంలో సోమవారం శ్రీ బసవేశ్వర స్వామి దేవాలయం నూతన ధ్వజస్తంభం ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామస్తులు చేపట్టారు. గుమ్మనూరులోని గుమ్మనూరు నారాయణ స్వగృహం నుండి బసవేశ్వర దేవాలయము వరకు నూతన ధ్వజస్తంభం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు,ఆలూరు నియోజకవర్గం బిజెపి బిఎల్ఓ 1 మరియు ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ,మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు



**నందవరం, జూన్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముగతి గ్రామంలో రైతన్నలు ఏరువాక పౌర్ణమి వేడుకలు సాంప్రదాయబద్ధంగా మండల టీడీపీ అర్గనైజింగ్ సె క్రెటరీ భార్గవ్ యాదవ్, గొర్రెల సంఘం అధ్యక్షుడు కొండా రెడ్డిలు ఘనంగా నిర్వహించారు. వర్ష రుతువు ప్రారంభమై వ్యవసాయ పనులు మొదలుపెట్టె శుభసమయానికి స్వాగతం పలుకుతూ గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తెల్లవారు జామునే రైతులు ఎద్దులకు శుభ్రంగా స్నానం చేయించి కొమ్ములకు పసుపు-కుంకుమ రంగులు పూసి గజ్జలు, గంటలు కట్టి అందంగా అలంకరించారు. ఎద్దులకు కట్టె తాళ్ళకు దూప దీప నైవేద్యాలతో పూజలు చేశారు. ఎద్దులకు బొట్టుపెట్టి బొప్పట్లు, బెల్లం, బియ్యం అవుపాలతో చేసిన పులగం ఆహారంగా పెట్టారు. రంగులు దిద్దిన ఎద్దులను రక రకాల బట్టలతో అలంకరించి మేళతాళాలు డప్పు వాయిద్యాల నడుమ ఊరంగా ఊరేగించారు. యువత ఏరువాక పుణ్యమి పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొనడంతో గ్రామంలో చిన్నపాటి హోలి పండుగ వాతావరణం నెలకొంది. సస్యానికి, ఓషదులకు అధిపతి చంద్రుడు వర్ష రుతువు మొదలయ్యాక జేష్ట నక్షత్రంలో నిండు పౌర్ణమి రోజే ఏరువాక పండుగ జరుపుకోవడం అనవాయితీ. దేశం సుభిక్షంగా ఉండాలని కరువు కాటకాలు లేకుండా వర్షాలు కురువాలని పాడిపంటలు చక్కగా పండాలని కోరుకుంటూ రైతులు ఈ పండుగను జరుపుకుంటున్నారు.

# శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

: రూ.40 లక్షల వ్యయంతో కాటేజీలు, నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**బనగానపల్లె, జూన్ 29, ప్రభాతవార్త:** మండలంలోని నందవరం గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్ పైభాగంలో సుమారు రూ.22 లక్షల అంచనా వ్యయంతో కాటేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.18 లక్షల అంచనా వ్యయంతో నూతన ఆధునిక టాయిలెట్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్/కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పీ.వి. నాగార్జున రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారని, వారికి మెరుగైన వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# యువత మేల్కొనాలి

: ఓటు హక్కుతో సరికొత్త చరిత్ర సృష్టించాలి ..



**పత్తికొండ, జూన్ 29, ప్రభాతవార్త :** పట్టణంలోని 14వ వార్డు 76వ పిఎస్ నెంబర్ పరిధిలోని ఓటర్ సర్ కార్యక్రమంలో బి ఎల్ ఓ రాజు గారితో కలిసి సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వయోజనులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అలాగే ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచూసుకోవాలని పట్టణ వాసులకు వివరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసన్న ఈరన్న వైఎస్ఆర్సిపి నాయకులు రవికుమార్ కాలనీవాసులు హనుమంతు రాముడు యనమల రంగన్న హనుమక్క లతోపాటు 14 వ వార్డు కాలనీవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# ఉరుకుంద దేవస్థానంలో టెంకాయ టెండర్ వేలం



**కౌతాళం, జూన్ 29, ప్రభాతవార్త:** కౌతాళం మండలంలోని ఉరుకుంద శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో సోమవారం టెంకాయ టెండర్ వేలం నిర్వహించారు. ఈ వేలం ప్రక్రియను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో, దేవస్థాన పర్యవేక్షకుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు. టెంకాయ టెండర్ వేలంలో గట్టూరి ఊలిగయ్య రూ. 80,00,000కు (ఎనభై లక్షలు) అత్యధిక బిడ్ దాఖలు చేసి టెండర్‌ను దక్కించుకున్నారు. అలాగే సగభాగం కొబ్బరి చిప్పల పోగు చేసే హక్కుల వేలంలో గంగుల రామిరెడ్డి రూ. 62,10,116కు టెండర్‌ను సొంతం చేసుకున్నారు. టెండర్ వేలం ప్రక్రియ ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించబడిందని దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ యుగంధర్ పోలీస్ సిబ్బంది దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థాన సిబ్బంది, టెండర్ దారులు పాల్గొన్నారు.

# అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే.. కఠిన చర్యలు..!

**కొత్తపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:** గ్రామాల్లో అసాంఘీక కార్యక్రమాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. సోమవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల మేరకు గువ్వలకుంట్ల గ్రామం నుండి బండినాయినిపల్లె వెళ్లె దారిలో గ్రామానికి చెందిన 6 మంది పేకాట ఆడుతుండగా రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి వద్ద నుండి రూ.5,350లు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు.

# ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి


: సబ్ కలెక్టర్‌కు ఎరుకుల సంఘం వినతి..



**ఆదోని, జూన్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:** మహాభారతంలో ధైర్యం, గురుభక్తి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన ఏకలవ్యుని విగ్రహాన్ని ఆదోని పట్టణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఎరుకుల సంఘం నాయకులు సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, మహాభారతంలో ఏకలవ్యుని చరిత్ర విశిష్టమైనదని, ఆయన ఎరుకుల సమాజానికి ఆదర్శప్రాయుడిగా నిలిచారని పేర్కొన్నారు. భావితరాలకు ఏకలవ్యుని చరిత్రను పరిచయం చేయడంతో పాటు ఆయన గురుభక్తి, త్యాగస్ఫూర్తిని స్మరించుకునేలా పట్టణంలోని అనువైన ప్రదేశంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిపత్రాన్ని సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని సబ్ కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల సంఘం నాయకులు మారుతి, ఎస్సీ, ఎస్టీ డివిఎంసీ సభ్యుడు రవి, ఎన్‌టీఎఫ్ రాయలసీమ ఇన్‌చార్జి మోపిరి సూరి, రామకృష్ణ, భీమేష్, కృష్ణ, రమేష్, సురేష్, వీరేష్, రఘు, మహేష్, వీరేంద్ర, అశోక్, బాలరాం, సుకన్నతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# టిడిపి తోనే అభివృద్ధి సాధ్యం!

: ఐదవ టిడిపి ఇంచార్జ్ అమర్ ప్రకాష్..



**ఆదోని రూరల్, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే అది టీడీపీ పార్టీతోనే సాధ్యమని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి లక్ష్యమని ఐదవ టిడిపి ఇన్చార్జ్ అమర్ ప్రకాష్ అన్నారు. సోమవారం ఆయన వార్డులో ఉన్న సార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్ ప్రకాష్ మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలని ఆయన ప్రతి ఒక్క కార్యకర్తకు పిలుపునిచ్చారు. ఏడుపదుల వయసులో కూడా రాష్ట్రాన్ని ఇంత అభివృద్ధి పథంలో నడుపుతున్నారంటే చంద్రబాబు ఎలాంటి విజన్ ఉన్న నాయకుడో ప్రపంచానికి తెలుసని, అదే బాటలో తండ్రికి తగ్గ తనయుడుగా మంత్రి నారా లోకేష్ కూడా అటు ప్రజల అభివృద్ధి కోసం ఇటు కార్యకర్తల సంక్షేమం కోసం ఎంతో పాటు పడుతున్నారని ఆయన తెలిపారు. రాబోయే కాలానికి కాబోయే అసలైన లీడర్ మా లోకేష్ అని దీమా వ్యక్తం చేశారు. ఆదోని అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందంటే అది కొంకా మీనాక్షి నాయుడు కృషి అని ఆయన తెలిపారు.

# గ్రామాలలో ఘనంగా ఏరువాక పున్నమి వేడుకలు



**చిప్పగిరి, జూన్ 29, ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం సాయంత్రం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతుల, గ్రామస్తులు వృషభలు లను సుందరంగా రంగురంగులతో అలంకరించి ఊరు వాకలి వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు.వృషభాలను ఊరేగింపు నిర్వహించి, కర్రీ తెంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామస్తులు రైతులు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పాల్గొన్నారు.కర్రీ తెంపే కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వృషభలును, రైతులను అభినందించి ఊరేగించారు.

# జాబ్ మేళాలో 125 మందికి ఉద్యోగ అవకాశాలు

- ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ



**ఆళ్లగడ్డ, జూన్ 29, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి కళాశాల వేదికగా సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 125 మంది నిరుద్యోగుల యువతకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 10 ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈజాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరై తమ ప్రతిభతో 125 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ స్వయంగా అఫర్ లెటర్లను అందజేసి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇలాంటి జాబ్ మేళాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషిచేసా తమన్నారు. యువత తమ విద్య, నైపుణ్యాలను పెంపొందించుకొని ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ఆమె తెలిపారు.

# రాగి వయర్ల దొంగలు అరెస్టు



**కోవెలకుంట్ల, జూన్ 29, ప్రభాతవార్త :** పోలాల్లోఉన్న ట్రాన్సుఫార్మర్లతో ఉన్న రాగినివైయర్లను దొంగతము చేసిన ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 83700 విలువగల 30కెజిల రాగి వైయర్లను స్వాదీనము చేసుకున్నట్లు సిఐ హనుమంతు నాయక్ చెప్పారు. జిల్లా యస్‌పి అదేశాల మేరకు రేవనూరు యస్ఐ ధనుంజయులు సిబ్బంది అలాగే సిసియస్ సిఐ సురేస్ వారి సిబ్బంది రాబడిన సమాచారము మేరకు అదివారము రేవనూరుస్టేషన్ పరిదిలో లోని వల్లంపాడు లింగాల గ్రామాలమద్య ఉన్న వాటర్ ట్యాంకు వద్ద ఇద్దరు వ్యక్తును అరెస్టు వారి వద్ద నుండి ఈమద్య వరుసగా జరిగిన నంద్యాల బండిఅత్మకూరు, రేవనూరు పోలీసు స్టేషన్‌పరదిలోని ట్రాన్సుఫార్మర్ లోని రాగివైయర్లు దొంగతనాలుచేసి కేసులు అరెస్టు చేసి మరియు నగదు స్వాదీనము చేసుకుని అరెస్టు చేశామని సిఐ చెప్పారు.

# ప్రతి ఓటు విలువైనదే.. ఓటు హక్కును పరిరక్షించుకోవాలి



**కర్నూలు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త :** కర్నూలు నగరంలోని 4వ, 5వ వార్డు సచివాలయాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను వైఎస్సార్సీపీ కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్, జిల్లా అధ్యక్షుడు ఎస్.వి. మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ అధికారులతో మాట్లాడిన ఆయన, ఓటరు నమోదు, సవరణలు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని, ప్రజలు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకుని అవసరమైన దరఖాస్తులు వెంటనే సమర్పించాలని సూచించారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా పరిరక్షించుకోవాలని ఆయన తెలిపారు.

# రైతులకు సబ్సిడీపై వేరుశనగ పంపిణీ..



**వెల్దుర్తి, జూన్ 29, ప్రభాతవార్త :** మండలంలోని వెల్దుర్తి గ్రామములోని రైతు సేవా కేంద్రములో సిద్ధనగట్టు, కృష్ణాపురం, కలుగొట్ల గ్రామాల రైతులకు మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా అధ్యక్షతన సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నూనె గింజల పథకం ఆయిల్ సీడ్స్ వాల్యూ చైన్ క్లస్టర్ పథకం కింద సేవాలాల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పత్తికొండ వారి ఆధ్వర్యంలో వేరుశనగ టిసిజిఎస్ 1694 రకాన్ని రైతులకు రాయితీపై రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.రైతులు తప్పనిసరిగా ఈ విత్తనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.విత్తనం పొందిన ప్రతి రైతు తప్పనిసరిగా తన పంట పొలాల్లో విత్తుకొని రాబోయే సీజన్ లో ఇదే విత్తనాన్ని మూల విత్తనంగా వాడాలన్నారు.విత్తనముతో పాటు చిరుపోషకాలు మరియు విత్తన శుద్ధి కొరకు ట్రైకోడెర్మా విరిడి మందులను రాయితీపై పంపిణీ చేశారు.భూసార పరీక్షల అవశ్యకత మరియు వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం పై అవగాహన కల్పించారు.భూమిలో తగినంత తేమశాతం ఉన్నప్పుడు మాత్రమే విత్తనాన్ని విత్తుకోవాలని తెలియజేశారు.ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు శాస్త్రవేత్తలు కెవికె బనవాసి వారు మూడు విడతలలో శిక్షణా తరగతుల ద్వారా సలహాలు, సూచనలు అందజేయనున్నమన్నారు. రైతు సేవా కేంద్రములలో రైతులకు తగినన్ని యూరియా, డి.ఏ.పి ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అక్బర్ భాష, సేవాలాల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ, రామాచారి, ఏఈఓలు అజయ్ భార్గవ్, సంధ్యా రాణి, మాలినిదేవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

- వృషభాలకు ప్రత్యేక పూజలు చేసిన అన్నదాతలు
- పారువేటలో గెలుపొందిన వృషభాల యజమానులకు సన్మానం..



**హొళగుంద, జూన్ 29, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన హొళగుంద తోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం వృషభాలకు స్నానం చేయించి రంగులు వేసి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హొళగుందలో వైకాపా మండల కార్యవర్గ సభ్యుడు పులిమర్రిస్వామి ఎద్దులు ఏరువాక పౌర్ణమి సందర్భంగా పారువేట నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం దగ్గర ఉన్న ఊరువాకిలి వద్ద నిర్వహించిన ఏరువాక పౌర్ణమి ఎద్దుల పారువేట పోటీల్లో మరిస్వామి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. విజయం సాధించిన వృషభాలను ఊరేగించారు. వాటి యజమానులను ఘనంగా సన్మానించారు. వృషభాల యజమానులు మరిస్వామి, వైకాపా నాయకులు సిద్దయ్య, లక్ష్మన్న, వెంకటేష్‌యాదవ్, ఎద్దులను మేళ తాళాలు, తప్పెట్లతో పూలహారాలతో పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

# సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు



**కొత్తపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:** జేష్ట శుక్ల పౌర్ణమి ఏరువాక పౌర్ణమి సందర్భంగా సంగమేశ్వర ఆలయానికి భక్తుల రాక పెరిగింది. గర్భాలయంలోని వేప దారు శివలింగానికి సోమవారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ కృష్ణా జలాలతో జలాభిషేకం, కుంకుమార్చన, ప్రదోషకాల పూజలు మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వరంలో తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ నుండి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా స్వామివారికి బిల్వదళ మాల లక్ష బిల్వ దళములు తీసుకువచ్చి పూజ కార్యక్రమం చేశారు. ఆలాగే స్వామివారికి మంగళహారతి సమయంలో డమరుకం సమర్పించారు. చుట్టు కృష్ణా జలాలు, మధ్యలో సంగమేశ్వరాలయం ఎంతో అధ్యాత్మిక చింతనకు, ఆహ్లాదానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆలయాన్ని సందర్శించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు సందర్శిస్తున్నారు.

# గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారించండి



**ఆస్పరి, జూన్ 29,ప్రభాతవార్త:** గ్రామాలలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, శానిటేషన్ సమస్యలను పరిష్కరించాలని ఎంపిపి సుంకర ఉమాదేవి, ఎంపిడిఓ గీతావాణి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా జోహారాపురం ఎంపిటిసి శ్రీరాములు మృతికి సంతాపం తెలియజేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28న జరిగిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఎంపిపి, ఎంపిడిఓలకు సమాచారం ఇవ్వకపోవడంతో వారు మండిపడ్డారు. దీంతో స్పందించిన డాక్టర్ బాలకృష్ణారెడ్డి ఇకపై ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టర్.మాట్లాడుతు చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయకూడదని, 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు చేయాలని సూచించారు. 18 నిండక ముందే పెళ్లి చేయడంతో అనారోగ్య బారినపడే అవకాశం ఉందన్నారు. విద్యుత్ ఏఈ అంజనేయశాస్త్రి మాట్లాడుతు మండల పరిధిలోనిములుగుంచిలిందం గ్రామంలో కమ్మరి గురురాజాచారి వెల్డింగ్ పనులు చేస్తు విద్యుత్‌షాక్కు గురై మృతి చెందడం జరిగింది. వారి కుటుంబసభ్యులు అతనికి సంబంధించిన డెత్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకువస్తే దానిని పై అధికారులకు పంపించి ఆయన కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అలాగే తంగరడోన ఎంపిటిసి నరసప్ప మాట్లాడుతు అధికారులు ప్రోటోకాల్ తప్పని సరిగా పాటించాలన్నారు. అనంతరం వివిధశాఖల అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి ఉదయభాను, డిప్యూటీ డిఈఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ తిరుమలరాజు, ఏపిఎం జనార్దన్, ఏపిఓ ఎం.సుందర్, ఏవో నరేంద్రకుమార్, ఎంపిటిసిలు రాధాకృష్ణ, రహంతుల్ల, లక్ష్మిదేవి, ప్రభావతమ్మ, పంచాయితీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు..

**ఎంపిటిసిలకు గౌరవ వేతనం ఇవ్వాలి:** గత మూడు సంవత్సరాలుగా ఎంపిటిసిలకు రావలసిన గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిలు కోరారు. దీనిపై స్పందించిన ఎంపిడిఓ గీతావాణి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వేతనాలు అందేలా చూస్తామన్నారు.

## కూటమి నాయకుల కబంద హస్తాల నుండి పాఠశాల స్థలాన్ని కాపాడండి



**కర్నూలు విద్య, జూన్ 29, ప్రభాతవార్త:** కూటమి నాయకుల కబందహస్తాల నుండి పాఠశాల స్థలాన్ని కాపాడాలని బహుజన్ ముక్తి పార్టీ జిల్లా కన్వీనర్ దాసరి రామశేషయ్య, కో కన్వీనర్ ఎస్కె జయన్నలు పేర్కొన్నారు. ఆదోని మండలం దొడ్డనకేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని మొన్నటి గ్రామ మొదటి పౌరునిగా చలామణి అయినటువంటి తాజా మాజీ సర్పంచ్ కూటమి మండలస్థాయి టీడీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ముఖ్య అనుచరుడు కురువ శివప్ప తమ గ్రామ సమస్యలను ముఖ్యంగా పాఠశాల సమస్యలను ముందుండి పరిష్క రించాల్సిన వాడు బరితెగించి నిసిగ్గుగా పాఠశాల స్థలాన్ని ఏకంగా తన కుటుంబ సభ్యుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటే మనిషి అన్నవాడు మనసున్నవాడు సహించిపోడు. పాఠశాల స్థలాన్ని మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు పేరుమీద ఆదోని సబ్ రిజిస్ట్రార్ రిజిస్టర్ చేశారంటే ఆయన అన్నమే తింటారా లేక డబ్బే తింటారా? పాఠశాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసే ముందుకు తను కూడ ఒక సాధారణ గ్రామీణ కుటుంబం నుండి గ్రామీణ పాఠశాలలో చదువుకొని ఉంటారు కదా ఆమాత్రం జ్ఞానం లేకపోవడం సిగ్గుచేటు. ఇలాంటి నీచమైన వారిని అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలి, బహుజనుడైన మాజీ సర్పంచ్ తన గ్రామానికి తమ గ్రామ బిడ్డలకు ద్రోహం చేస్తున్నాడేమో అనే స్పృహ లేకపోవడం సిగ్గుచేటు, కూటమి నాయకులు తమ కూటమి సభ్యుడు పాఠశాల స్థలాన్ని కబ్జా చేశారని తెలిసి కూడ వారించకపోవడమంటే సభ్యులందరికి ఇదేదారేమో అని గుస గుసలాడుతున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ నాయకులు కబ్జా కోరులను కట్టడి చేయకుండా పార్టీకి నష్టం. అధికారులు స్పందించకుంటే ప్రత్యక్ష కార్యచరణకు బహుజనులందరు నడుం బిగిస్తారని బహుజన్ ముక్తి పార్టీ వారు హెచ్చరించారు.

## ఆదర్శపాఠశాల టాపర్స్‌కు ఘనమైన సన్మానం



**రుద్రవరం, జూన్ 29, ప్రభాతవార్త:** రుద్రవరం ఆదర్శపాఠశాల విద్యార్థుల ప్రతిభకు ఘనమైన సత్కారం చేశామని ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వర్‌రావు తెలిపారు. పదవతరగతి టాపర్స్‌కు నగదు బహుమతులు తల్లిదండ్రుల సమక్షంలో సోమవారం అందజేయడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రుద్రవరం మండలంలోని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ (ఏపీఎంఎస్)లో 2026 విద్యాసంవత్సరం పదవతరగతిలో అత్యుత్తమ ప్రతిభచూపిన విద్యార్థులను ఘనంగా సన్మానిస్తు పదవతరగతి టాపర్స్ పెలిసిటేషన్ కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించామన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించినట్లు తెలిపారు. విద్యార్థుల విజయానికి కీలకంగా నిలిచిన తల్లిదండ్రుల పాత్రను గుర్తిస్తు వారిని ప్రత్యేకంగా వేదికపైకి ఆహ్వానించి సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. పది ఫలితాల్లో అత్యుత్తమ మార్కురులు సాధించిన వారికి ఎండి నజీర్ చేతుల మీదుగా మొదటి బహుమతి రూ.3 వేలు, బి గౌరి రెండవ బహుమతి రూ.2 వేలు, తనుష్క మూడవ బహుమతి రూ.1000లు సృతిలకు అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేసిన నజీర్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈవిద్యార్థుల విజయం రేపటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని వారు తెలిపారు. ముగింపులో ఉపాధ్యాయ బృందం శాలువలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ప్రసాద్, వైస్ చైర్మన్ లక్ష్మి, యువ నాయకుడు, యువరాజు, గ్రామపెద్దలు, విజేతలకు శుభాకాంక్షలు తెలిపుతూ వారి భవిష్యత్తు మరింత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గడివేముల శ్రీ మూల పెద్దమ్మ హుండీ లెక్కింపు



**గడివేముల, జూన్ 29, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేముల లోని శ్రీ మూల పెద్దమ్మ వారి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి, ఈఓ స్వర్ణముఖీ, ఆలయ చైర్మన్ దేశం రమణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. శ్రీ బాలాజీ సేవా ట్రస్ట్ వారు లెక్కింపునకు సహకారం అందించారు. ఆలయ చైర్మన్ దేశం రమణారెడ్డి మాట్లాడుతూ ఈ మూడు నెలల్లో హుండీ లెక్కింపులో రూ.5,83,208 ఆదాయం రావడం జరిగిందన్నారు. ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు.

## ఎయస్ఐ ఉదారత



**కోవెలకుంట్ల, జూన్ 29, ప్రభాతవార్త :** బిజినవేములకు చెందిన ఎయస్ఐ బత్తుల ఓబులేసు అనారోగ్యముతో ఉండే సొసైటీ అంటెండరు గాందీకుటుంబానికి రూ.10000 నగదును అందించారు ఇటీవల సహకార సొసైటీ అంటెండరు గాందీకి బైసాస్ సర్జిరీ చేశారు. అనేపథ్యములో ఎయస్ఐ ఓబులేసు అన నివాసమునకు వెల్లి వారి కుటుంబ సభ్యులకు రూ 10000 అర్తిక సహాయం అందించుడు. ఈకార్యక్రమంలో సొసైటీ సిఈఓ యంఅబ్దుల్ కలాంభాష, యం.ఇస్మాయిల్, వెంకటసుబ్బారెడ్డి అస్సాన్‌రెడ్డి మనోహరు. మద్దులేటి తదితరులు పాల్గొన్నారు.

## బోరింగ్ రిపేరు చేయాలని ఎంపీడివోకు వినతి



**పాములపాడు, జూన్ 29, ప్రభాతవార్త:** పాములపాడు గ్రామంలోని ఏఎన్ఆర్ కాలనీ మహిళలు నాయకులు టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యలో బోరింగ్ మరమ్మత్తులు చేయించి తాగునీటిని అందించాలని ఎంపీడివో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బోరింగ్ పైపులకు రంధ్రం పడడంతో నీళ్లు రావడం లేదని తక్షణమే స్పందించి పైపులు మార్చి రిపేరు చేయించి తాగునీటిని అందించాలని మహిళలు ఎంపీడివోను కోరారు. స్పందించిన ఎంపీడివో చంద్రశేఖర్ సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

## కొలనుభారతి క్షేత్రంలో భక్తుల రద్దీ



**కొత్తపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లమల కొండల్లో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. కొలనుభారతి అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి చారు ఘోషిని నది జలాలతో జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కాయ కర్పూరాలు సమర్పించి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న సప్తశివాలయాలను దర్శించుకున్న అనంతరం విద్యా సంవత్సరం మొదలవడంతో 46 మంది చిన్నారులకు వారి తల్లిదండ్రులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో బీజక్షరాలతో అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

## ఘనంగా మౌలాలి స్వామి జార్తులు



**రుద్రవరం, జూన్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రం రుద్రవరంలో సోమవారం మౌలాలి స్వామి జార్తులు ఘనంగా నిర్వహించారు. గత కొన్ని ఏళ్ళ నుండి అనవాయితీగా మొహరం పండుగ వేడుకలు పురస్కరించుకొని పండుగ ముగిసిన మూడవ దినం మౌలాలి స్వామి జార్తులను గ్రామపెద్దలు సంఘ సభ్యులు నిర్వహిస్తారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుండి వచ్చిన భక్తాదులందరు స్వామివారిని కన్నులవిందుగా దర్శించుకుంటారు. అనంతరం గ్రామపెద్దలు దర్శనానికి వచ్చిన భక్తాదులందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. మౌలాలిస్వామి రుద్రవరంలోని పలు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారికి ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు.

## గ్రామాలలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన బిఎల్ఏలు



**చిప్పగిరి, జూన్ 29, ప్రభాతవార్త ;** మండల పరిధిలోని బెల్డోన, కుందనగుర్తి గ్రామాలలో సోమ వారం సాయంత్రం సర్ కార్య క్రమాన్ని బిఎల్ఏలు పరి శీలించారు. ఆలూరు టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు క్లస్టర్ నంబర్ 04 నందు గల.. బూత్ నెంబర్స్ 97,98,99 బూతుల నందు బిఎల్ఓలు, బిఎల్ఏలు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ ప్రోగ్రాం వేగవంతం చేయాలని పకడ్బందీగా చేయాలని, కచ్చితంగా ప్రతి ఇంటికి వెళ్లి ఈ సర్వే నిర్వహించాలని,గ్రామంలోని ప్రతి ఓటరు బిఎల్ఓ లకు బిఎల్ఏలకు అందరూ తప్పకుండా సహకరించాలని సూచించినట్లు మండల టిడిపి కన్వీనర్ కొండా పురుషోత్తం తెలిపారు.ఈ ప్రోగ్రాం నందు టిడిపి నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు మండల నాయకులు గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు సీనియర్ నాయకులు ప్రతి ఒక్కరూ హాజరై ప్రతి ఓటును కాపాడే బాధ్యత మన పైన ఉన్నది. కావున అందరు తప్పనిసరిగా పాల్గొని మై టిడిపి యాప్ లో ఎస్ఐఆర్ అనే కార్యక్రమం అప్లోడ్ చేయవలసిందిగా కోరారు. టిడిపి సీనియర్ నాయకులు కోనంకి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బారులో ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు న్యాయం చేస్తాం..



**నంద్యాల, జూన్ 29, ప్రభాతవార్త ప్రతినిధి :** తమ సమస్యలను పరిస్కరించాలని ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జిని క్షుణంగా పరిశీలించి వాటిని తప్పకుండా పరిస్కరిస్తామని రాష్ట్ర రోడ్డు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారము మంగళగిరి తెలుగు తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో మంత్రి జనార్ధనరెడ్డి పాల్గొని అర్జిలను స్వీకరించారు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమర్పించిన అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజలు వినిపించిన సమస్యలను విజ్ఞప్తులను క్షుణంగా పరిశీలించి న్యాయబద్ధమైన సమస్యలను పరిస్కారానికి ప్రభుత్వం తరుపున అవసరమైన చర్యలు తీసుకుంటామని బాదితులకు హామీ ఇచ్చారు. ప్రతి అర్జిదారుడి సమస్యను ఓదర్పుతో అలకించి సంబందిత అదికారుల దృష్టికి తీసు కుని వెళ్లి సత్వర పరిస్కారము కోసం చర్యలు చేపట్టాలని అదికారులను అదేశించారు. ఈసందర్భముగా మంత్రి మాట్లాడుతూ తాము ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నింటిని నేరవేరుస్తున్నామని చెప్పారు.ఇక్కడ మీరు ఇచ్చిన ప్రతి సమస్యను యుద్ద ప్రాతిపదికన పకరిష్కరిస్తామని చెప్పారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**ఆదోనిలీగల్, జూన్ 29, ప్రభాతవార్త;** కుప్పగల్లు-ఇస్వీ రైలే వ్స్టేషన్‌ల మధ్య అప్ లైన్ ట్రాక్ వద్ద (కి.మీ. నం. 508/5-7) పక్కన ఓ మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైలే ్వ హెడ్‌కానిస్టేబుల్ సి.శివరామయ్య సోమవారం తెలిపారు. మృతుడు నీలంరంగు ఆఫ్ టీ షర్ట్, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. తెలుగు డిజైన్ కలిగిన ఫుల్ డ్రాయర్ ధరించాడన్నారు. ఎవరైనా గుర్తించిన వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని గానీ, రైల్వే పోలీసులను గానీ సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు రైలే ్వ హెడ్ కానిస్టేబుల్ సి.శివరామయ్య తెలిపారు.

## ఆర్ఆర్ లేబర్ కాలనీ రోడ్డు కష్టాలకు త్వరలోనే పరిష్కారం



**ఆదోనిటౌన్, జూన్ 29, ప్రభాతవార్త;** ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు ఆర్ఆర్ లేబర్ కాలనీకి సరైన రోడ్డు వసతి, రోడ్డు పక్కనే ఉన్న ఆవుదూడ వంకకు ప్రహారీగోడ లేకపోవడంతో తరుచూ రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయని మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అదే రోడ్డులో ప్రతిరోజూ వందలాది మంది పాఠశాలల విద్యార్థులు లేబర్ కాలనీ హైస్కూల్‌కు వెళ్తుంటారన్నారు. వారం రోజుల నుంచి సీపీఐ పార్టీ నాయకులు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ ధర్నాలు కూడా చేస్తున్నారన్నారు. రోడ్డు పనులకు రూ.23 లక్షలు నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని ఆమె తెలిపారు. ఎంఈ సత్యనారాయణ, డీఈ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఆవుదూడ వంకపై ఎమ్మెల్యే పార్థసారథి పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు చేపడతామని వారు చెప్పారు. బీజేపీ నాయకులు వెల్లాల మధుసూదనశర్మ, నకుల రాజు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, చరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల సామాగ్రి విరాళం ఇచ్చిన దాతలు



**తుగ్గలి,జూన్ 29,ప్రభాతవార్త:** మండల పరిధిలోని శభాష్‌పురం గ్రామంలో మొహారం పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన కీ.శే.తలారి పైకొట్టం రామాంజనేయులు సతీమణి లక్ష్మిదేవి కుమారులు టి.రంగస్వామి ఎస్ఏ టీచర్, టి.శేఖర్ విఆర్ఏ తోపాటు వారి కుటుంబ సభ్యులు గ్రామంలో నిర్వహించిన మొహారం ఉత్సవాల కోసం రూ.1లక్ష విలు వైన సామాగ్రిని విరాళంగా అందజేశారు. విరాళంగా అందించిన సామాగ్రిని ఉత్సవ కమిటీ సభ్యులకు అప్పగించిన అనంతరం పీర్ల స్వాములకు ప్రత్యేకపూజలు నిర్వహించి తమమొక్కులను చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ప్రార్థించారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహారం వేడుకలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు సహకరిస్తుంటారని, ఈ ఏడాది తలారి కుటుంబం అందించిన రూ.లక్ష విలువైన సామాగ్రి ఉత్సవాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతలను గ్రామపెద్దలు కొనియాడారు. గ్రామ పెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు, యువకులు, భక్తులు,మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సహాకార సంఘం సేవలతోనే రైతుకు సంపూర్ణ అభ్యున్నతి



**తుగ్గలి,జూన్ 29,ప్రభాతవార్త:** దేశానికి వెన్నెముక అయిన రైతు పెట్టు బడి భారతో కుంగిపోతు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకుంటున్న అన్నదాతను గట్టెక్కించే అసలైన సంజీవని సహాకార రంగమేనని ఉప్పరపల్లి సొసైటి చైర్మన్ సిఈఓ గిడ్డయ్య, మారెళ్ళ సొసైటి సిఈఓ మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని జొన్నగిరి, పెండేకల్లు ఆరెఎస్ గ్రామాలలోని ఉప్పర్లపల్లి, మారెళ్ళ సొసైటిలో 2026 సహాకార వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీంతో వారు జెండాను ఆవిష్కరించారు. జూన్ 29 నుంచి జూలై 7వరకు ఈ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సహాకార సంఘాల రైతులకు కేవలం ఋణాలు అందించే సంస్థలే కాకుండా వారి ఆర్థికాభివృద్ధికి బలమైన భాగస్వామ్యులుగా నిలుస్తున్నాయని తెలిపారు. తక్కువ వడ్డీతో పంట ఋణాలు, పంటభీమా ప్రభుత్వ సబ్సీడీలు, రైతు సంక్షేమ పథకాల అమలులో సహాకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ప్రతి రైతు సహాకార సంఘం సభ్యుడిగా మారి అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకుంటే వ్యవసాయ భారం తగ్గడంతో పాటు ఆధాయం పెరిగే అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని మహిళా రైతుకు సన్మానం



**వెల్దుర్తి, జూన్ 29, ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయం కోసం గో సేవ కోసం ఆయుర్వేదిక వైద్యం కోసం అమెరికాలోని తన వైద్య వృత్తిని వదులుకొని దాదాపుగా 40 ఎకరాల్లో వ్యవసాయాన్ని చేస్తున్న మహిళా రైతును ఏరువాక పౌర్ణమి సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తి మార్నేపల్లి గ్రామ సమీపంలో తమ సొంత వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రుషి గోసేవ ఆశ్రమం ఏర్పాటు చేసిన డాక్టర్ మాధవి ప్రకృతి వ్యవసాయం మీద ప్రేమతో గోబర్ గ్యాస్ తయారు చేస్తూ వినియోగిస్తూ ఎన్నో అరుదైన పుష్పజాతులను పండ్ల జాతులను వృక్షాలను సంరక్షిస్తూ వృక్షాలను పెంచాలని ఎందరికో అవగాహన కల్పిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, డాక్టర్ మాధవి త్వరలోనే ప్రపంచంలోనే అరుదైన వైద్యులచే ప్రకృతి వైద్యం కూడా అనేక రుగ్మతలకు, మొండి రోగాలకు అందించనున్నారని అందుకే డాక్టర్ మాధవిని హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున వ్యవసాయ క్షేత్రం రుషి ఆశ్రమంలో కలిసి ఆమెను హృదయపూర్వకంగా అభినందించి ఘనంగా సన్మానించారు. హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు, సభ్యులు వైద్యం రామనాయుడు స్ఫూర్తి సేవా సంస్థ ఆర్యన్ మధు, మహానంది పాల్గొన్నారు.

## క్లోరిన్ వాటర్‌ను టెస్టింగ్ చేసిన అధికారులు



**ఆదోనిలీగల్, జూన్ 29, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని 2వ వార్డు బాబాజీ పేట ప్రాంతంలో తాగునీటి నాణ్యతను పరి శీలించేందుకు క్లోరిన్ వాటర్ టెస్టింగ్ సోమవారం నిర్వహించారు. మున్సిపల్ డీఈ రామమూర్తి, ఏఈ భువనచంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని బాబాజీపేట మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో చేపట్టారు. డోర్ నంబర్ 4-11-119 వద్ద వాటర్ టెస్టింగ్‌ను ఎం.చంద్రశేఖర్ నిర్వహించారు. టెస్టింగ్‌లో క్లోరిన్ స్థాయి 0.7 పీపీఎంగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఇది తాగునీటికి సురక్షిత పరిధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ కె.శ్రీనివాస్‌సింగ్ పాల్గొన్నారు. స్థానికులకు తాగునీటిపై ఎలాంటి సందేహాలు లేకుండా చూసేందుకు ఈ పరీక్ష చేశామని నిర్వాహకులు తెలిపారు.


## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



**పాములపాడు, జూన్ 29, ప్రభాతవార్త:** పాములపాడు మండలం యర్రగూడూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి 340-సీపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు తీవ్రంగా గాయపడ్డారు. పాములపాడు ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు పట్టణానికి చెందిన కరిముల్లా, సాజిద మోటార్ సైకిల్‌పై కర్నూలు వైపు నుండి ఆత్మకూరు వెళ్తుండగా ఎర్రగూడూరు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా ట్రాక్టర్ రావడంతో ఎదురేదురుగా ఢీకొనడంతో భార్యభర్తలిద్దరు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్లకు మరమ్మతులు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

– వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి



**ఆదోనిలీగల్, జూన్ 29, ప్రభాతవార్త;** ఆదోని నియోజకవర్గంలో ఇటీవల రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రమాదాలను అరికట్టడం లో, రోడ్లకు మరమ్మతులు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయన్నారు. వాహనదారులు రోడ్లపై ఉన్న గుంతలను గమనించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు పడిన గుంతలను పూడ్చి, రోడ్లను బాగు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## బాధితా కుటుంబానికి అండగా నిలిచిన టీడీపీ సీనియర్ నాయకులు



**హొళగుంద, జూన్ 29, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన హొళగుందలోని బీసీ కాలనీ బుడగ జంగాల వీధికి చెందిన యువకుడు గుండె, ఊపిరితిత్తుల సంబంధిత జబ్బుతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న హొళగుంద టీడీపీ సీనియర్ నాయకులు యారిస్వామి స్పందించి ఆ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. తనవంతు ఆర్థిక సాయాన్ని అందించి బాధితా కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంపాపతి, బుడగ జంగాల రామంజిని, బీజేపీ దేవన్న, బసవ, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కష్ట సమయంలో వెంటనే స్పందించి సాయం చేసిన యారిస్వామికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బాధితుడికి రూ.25 వేలు సాయం అందించిన జనసైనికులు



**హొళగుంద, జూన్ 29, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన హొళగుందలోని బుడగ జంగాల కాలనీకి చెందిన మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహేష్ అనే యువకుడు గుండె, ఊపిరి తిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆలూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెర్నెకల్ వెంకప్ప ఇంటి సరుకుల నిమిత్తమై రూ.25 వేలు నగదును సోమవారం జనసైనికుల చేత అందించారు. అలాగే ఆసుపత్రి చికిత్సల గురించి అధికారులతో మాట్లాడి తనవంతు సాయం చేస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హొళగుంద మండలానికి చెందిన అన్ని గ్రామ యువ నాయకులు తమకు తోచిన సాయం అందించి బాధితా కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా బాధితా కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పన్నులు చెల్లించి.. వడ్డీ నుండి విముక్తి పొందండి..!

– నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు..



**కర్నూలు మున్సిపల్, జూన్ 29, ప్రభాతవార్త:** మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను, తాగునీటి కొలాయి చార్జీలను జూన్ 30 లోపు చెల్లించి వడ్డీభారం నుండి విముక్తి పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సోమవారం కోరారు. జూన్ 30తో మొదటి అర్ధసంవత్సరం ముగియనున్నందున ఇంకా బకాయిలు ఉన్న పన్ను చెల్లింపుదారులు మంగళవారం లోపు తమ బకాయిలను పూర్తిగా చెల్లించాలని సూచించారు. గడువు అనంతరం నిబంధనల ప్రకారం వడ్డీ విధించబడుతుందని తెలిపారు.

04 page 30_04 page 30.qxd 29-06-2026 PM 10:29 Page 1



# ప్రజా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సత్వరమే పరిష్కరించాలి

**: పీజీఆర్ఎస్‌లో 304 ప్రజా దరఖాస్తుల స్వీకరణ : జిల్లా కలెక్టర్**

**నంద్యాల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమా మహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారం అందించాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించినప్పటికీ తిరిగి రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖలు నాణ్యమైన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు సంబంధించిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తగిన ఎండార్స్‌మెంట్‌తో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరభూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశాన్ని ఈ క్లినిక్‌లు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 148 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 4, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22ఏ భూములకు సంబంధించినవి 10, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 34, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 59, సర్వే మరియు రీసర్వేలకు సంబంధించినవి 32, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 6 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

# చట్టపరంగా న్యాయం

**: పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 101 ఫిర్యాదులు**

**కర్నూలు, జూన్ 29, ప్రభాతవార్త :**



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత పోలీసు అధికారులు స్పందించాలని ఆయన ఆదేశించారు. సోమవారం కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 101 ఫిర్యాదులు అందాయి. ఉద్యోగాల పేరుతో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటనలు, భూ మోసాలు, కుటుంబ ఆస్తుల వివాదాలు, బంగారు ఆభరణాల అపహరణ, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి భూమిని ఆక్రమించే ప్రయత్నాలు తదితర అంశాలపై ఫిర్యాదులు నమోదయ్యాయి. పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన వ్యక్తి తన ఇద్దరు కుమారులకు రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.36 లక్షలు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల సమీపంలోని భూమి విక్రయం పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేశారంటూ మరో ఫిర్యాదు అందింది. మార్కాపురం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామానికి చెందిన దంపతులు తమ మూడు తులాల బంగారు గొలుసును తీసుకున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే ఫ్లాట్, ఇల్లు ఆక్రమించే ప్రయత్నాలు, విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేయడం, కోర్టు ఆదేశాలను ధిక్కరించి పంటను ధ్వంసం చేయడం వంటి అంశాలపై కూడా వినతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, ఇస్మాయిల్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ పార్టీ

**: రూ. 5 లక్షల ప్రమాద భీమా పరిహారం అందజేసిన మంత్రి ఫరూక్..**



**నంద్యాల జూన్ 29 ప్రమాద వార్త ప్రతినిధి :**
నంద్యాల 29 వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ నూర్జహాన్, నూనెపల్లె ఆయిల్ మిల్ సమీపంలో జరిగిన దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి విదితమే. దివంగత నూర్జహాన్ గారికి టిడిపి పార్టీ సభ్యత్వం ఉండటంతో, వారి కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని నంద్యాలలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి ఫరూక్ వెంటనే స్పందించి, అవసరమైన పత్రాలను సేకరించి, యుద్ధ ప్రాతిపదికన మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయానికి పంపించారు . టీడీపీ పార్టీ అధిష్టానం ఈ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి, తక్షణమే రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయలు) ప్రమాద భీమా పరిహారాన్ని మంజూరు చేసింది. ఈ ప్రమాద బీమా పరిహారాన్ని నంద్యాలలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు మంత్రి ఎన్ఎండి ఫరూక్ షేక్ నూర్జహాన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ ఎల్లప్పుడూ తన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని మంత్రి ఫరూక్ తెలియజేశారు.

# నాడు సీమ.. కరువు నేడు సీమ.. పరిశ్రమలకు నిలయం

**నంద్యాల, జూన్ 29, ప్రభాతవార్త ప్రతినిధి**



రాష్ట్రంలో తెలుగు దేశం పార్టి రెండవమారు అధికారములోకి వచ్చిన పిదప నీటి కరువు సీమ అయిన రాయలసీమ నేడు పరిశ్రమల సీమగా మారుతుంది రాష్ట్ర రోడ్డు భవనాలు, పెట్టుబడులు, మౌళిక వసతుల శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి చెప్పారు. సోమవారము మంత్రి బిసి మీడియాలో మాట్లాడుతూ ఒక నాడు రత్నాలు పండిన సీమ తర్వాత కరువు సీమగా మారింది. అయితే రాష్ట్ర విభజన జరిగిన పిదప మొదటి సారి 2014 నుండి 19 వరకు తెలుగు దేశం పార్టి అధికారములు చేపట్టింది. నాడు కరువు సీమలో ఒక బాగమైన అనంతపురము జిల్లాలో కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు చేయడము జరిగిందన్నారు. దీనితో 13 వేల మంది ఉపాది లబించిందన్నారు. అలాగే దాని వల్ల ప్రభుత్వంకుసుమారు 10000 కోట్లు అదాయం వస్తున్నదనిచెప్పారు. నాడు అక్కడ పరిశ్రమ స్థాపనకు ముందు ఎకరా రూ 5లక్షల పలికే భూమి నేడు అక్కడ ఎకరా రూ 50లక్షలు పలుకుతుందని చెప్పారు. రెండవ మారు అంటే 2024 అదికారం చేపట్టినపిదప కరువులకునియమైన రాయలసీమ ఇప్పుడు పరిశ్రమలకు కేంద్రముగామారిందన్నారు. సీమకు వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. అదికారము చేపట్టిన 24 నెలల్లోనే 240 పరిశ్రమలు తేవడము జరిగిందన్నారు. వీటిని విలువ 5లక్షల 33వేల కోట్లు ఉంటుందని చెప్పారు. అందులో సీమకు 3వ వంతుఉద్యోగాల్లో సింహబాగము వచ్చాయని చెప్పారు. లోకేష్‌బాబు1000కోట్లు పెట్టుబడులతో క్యారేర్ తిరుపతిలో25800ఇది మద్రాసు పోయాల్సిన కంపెనీని తిరుపతిలో రాయలఫీల్డ్‌రు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక సంవత్సకాలంలోనే పూర్తి చేయాలని సియం అదేశించారు. అలాగే సత్యసాయి జిల్లాలో పుట్టపత్రిలో డిఅర్‌డిఓ కింద 15800 కోట్ల పెట్టుబడులతో ఎయంసిఐకంపెనీ యుద్దవిమానాల పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పరిశ్రమ స్థాయిస్తే 7500మంది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈపరిశ్రమతో పాటు అనే అనుబంధ పరిశ్రమలు అక్కడికి వస్తున్నాయని చెప్పారు. పుట్టపత్రి కేంద్రము మారుతుంది. పుట్టపత్రిలో 1లక్ష 50వేల కోట్లతో పరిశ్రమలు పెట్టుతున్నారు. అదే విదముగా సత్యసాయి జిల్లాలోనే రియన్సులో 51 కోట్లుతో బ్యాటరీ పరిశ్రమలు వస్తున్నాయి. కడప జిల్లాలో అదాని సంస్థ ద్వారాహైడ్రో 12వేల కోట్లుతో ప్రాజెక్టులు, కర్నూలు జిల్లాలో ఫుడ్ , అలాగే ఓర్వకల్లులో 5వేల కోట్లు పనులు జరుతున్నాయని చెప్పారు. ఇలా కరువు సీమను తిరిగి పరిశ్రమల సీమగా తయారు చేస్తున్నామని స్పష్టం చేశారు.

# శ్రీశైలం అబివృద్ధి పనుల అక్రమాలపై చర్యలు..!

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్29, ప్రభాతవార్త :**



శ్రీశైలక్షేత్రంలో గత ప్రభుత్వ హాయంలో గణేష్ సదనం సిసి రోడ్డు, పార్కు, నక్షత్రవనం పుట్‌పాత్, పారెస్ట్ బౌండ్రిస్, జరిగిన అబివృద్ధి పనులల్లో అవకతవకలు జరిగినట్లు విజిలేన్స ఆండ్ ఎన్‌పోర్స్‌మెంటు శాఖ ప్రభుత్వంకు నివేదిక అందజేసింది. నివేదికను ఆదారంగా చేసుకొని గతంలో పనిచేసిన ముగ్గురు ఈవోలు, ఒక డిఈఈ, ఇద్దరు ఏఈలపై చర్యలు తీసుకునే విధంగా విజిలేన్స్ శాఖ నివేదికను సమర్పించింది. ఈక్రమంలోనే దేవదాయశాఖ చర్యలు తీసుకునేందుకు సిద్దం కావడం జరిగింది. అబివృద్ధి పనుల్లో జరిగిన అవకతవకలపై దేవదాయశాఖ కమీషనర్ అప్పట్లో పనులు చేసిన గుత్తేదారుల నుండి మొత్తం రికవరి చేయాలని ఉత్తర్వులు జారిచేసారు. అవకతవకలు జరిగినాయని నిర్ధారణకు వచ్చిన ఆశాఖ దేవస్థానం అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం జరుగుతున్నదనేది ప్రశ్నర్థాకంగా ఉంది. కోట్ల రూపాలయాలు అబివృద్ధి పనులు జరిగితే దేవదాయశాఖ ఉత్తర్వలు లక్షల రూపాయాల్లో గుత్తేదారుల నుండి రికవరి చేయామని అదేశించడం క్షేత్రంలో చర్చానీయాంశంగా మారింది. విజిలేన్స్ శాఖ నివేదిక ఎంత అక్రమాలకు పాల్పపడిందని నివేదిక ఇచ్చింది, దేవదాయశాఖ ఎంత రికవరికి ఆదేశించింది అన్న విషయం కూడా చర్చానీయాంశంగా మారింది. క్షేత్రంలో చర్చానీయాంశంగా మారిన విషయంపై మరింత వాస్తవాలు వెలుగు చూడాల్సి ఉంది.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలి ఎమ్మెల్యే కోట్ల

**డోన్ జూన్ 29 ప్రభాతవార్త**



ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని నిర్దేశించిన గడువులోగా వేగవంతం గా పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి సూచించారు సోమవారం టిడిపి పార్టీ కార్యాలయం నందు బిఎల్ఏ లో సమీక్ష సమావేశం నిర్వహించి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూతు పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు చేయాలని సూచించారు అదేవిధంగా అర్హులైన ప్రతి ఓటర్ పేరు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని అవసరమైన దరఖాస్తులను వెంటనే పూర్తిచేసి సమర్పించాలని ఆదేశించారు క్లస్టర్ ఇన్చార్జీలు పరస్పర సమన్వయంతో పనిచేసే ప్రతిరోజు పురోగతిని సమర్పించుకోవాలని ప్రతి బూతులో నిర్ణీత లక్ష్యాలను పూర్తి చేసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా ప్రతిబిఎల్ఏ బాధ్యతగా వ్యవహరించి ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటం పల్లి శ్రీనివాసులు టిడిపి నాయకులు గుండాల జయరాముడు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం

**కర్నూలు అర్బన్ జూన్ 29 ప్రభాతవార్త :**



కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో నెలకొన్న సమస్యలపై వైఎస్సార్సీపీ కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్‌లో తీవ్ర జాప్యం, ఫారాలు సమర్పించిన వారికి అక్నాలెడ్జ్‌మెంట్ రసీదులు ఇవ్వకపోవడం, బీఎల్ఓల పనిలో రాజకీయ జోక్యం, ఆన్‌లైన్ దరఖాస్తులు మరియు డేటా ఎంట్రీలో సాంకేతిక సమస్యలను ఆయన జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి సచివాలయంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, డేటా ఎంట్రీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి జూలై 14లోపు ఎన్యుమరేషన్ ఫారం తీసుకుని పూర్తిగా నింపి బీఎల్ఓకు సమర్పించడంతో పాటు అక్నాలెడ్జ్‌మెంట్ రసీదు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలని హాఫీజ్ ఖాన్ సూచించారు.

# దోమల నివారణకు పటిష్టమైన చర్యలు



**కర్నూలు మున్సిపల్, జూన్ 29, ప్రభాతవార్త:**
నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం ఆయన వీకర్ సెక్షన్ కాలనీ–2లో అబేట్ ద్రావణ పిచికారిని పరిశీలించారు. అంతకన్నా ముందు బుధవారపేట వద్ద 6వ శానిటేషన్ డివిజన్ మస్టర్ తనిఖీ చేశారు. కెసికెనాల్, దేవనగర్, ఇందిరమ్మ కట్ట, చెన్నమ్మ సర్కిల్ ఎల్కూర్ బంగ్లాస్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు తెలిపారు. లార్వ ఉత్పత్తి 39 మంది ప్రత్యేక సిబ్బంది, 10 యంత్రాల్లో స్ప్రేయింగ్ ఫాగింగ్‌లను చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి వీధిలో ఉదయం పూట అబేట్ ద్రావణం పిచికారి చేస్తున్నామని ఈప్రక్రియ ప్రతివీధిలో పదిరోజులకొకసారి జరుగుతుందన్నారు. మధ్యాహ్నం, సాయంత్రం మలాదియాన్ ద్రావణ ఫాగింగ్ రెండువారాలకొకసారి చేపట్టడం జరుగుతుందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా అయిల్ బాల్స్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇళ్లవద్ద నీరు నిల్వలేకుండా చూసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డా. ఎం రఘు, సీనియర్ ఎండమాలజిస్టు సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు జిలాని, ఫరూక్, అలిం బాష తదితరులు పాల్గొన్నారు.

# రంకెలేసిన ఎద్దు.. మురిసిన రైతు..!

**– మిన్నంటిన ఏరువాక పౌర్ణమి వేడుకలు..**

**కోసిగి, జూన్ 29, ప్రభాతవార్త :**



ఏడాదంతా పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు ఖరీఫ్‌లో వచ్చే ఏరువాక పండుగను ఎంతో ఉత్సాహంతో జరుపుకోవడంతో అటు ఎద్దులు రంకెలు వేసాయి.. దీంతో వీటిని వీక్షించిన రైతు మురిసి పోయాడు.. కోసిగి మండలంలో రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సాహంతో రైతులు ఎద్దులను ఊరేగించేందుకు ముందుకు వచ్చారు.. ఈ నేపథ్యంలో ముందుగా గ్రామంలో రైతులు ఎద్దుల బండ్లతో ఊరేగించారు. అలాగే గ్రామ దేవతలకు విశేష పూజలు చేశారు. అంతేకాక ఎద్దులకు స్నానం చేయించి పూజలు చేసి కొమ్ములకు రంగులు వేసి తయారు చేసారు. ఇది ఇలా ఉంటే గ్రామాల్లో పశు సంపద ఏటేటా తగ్గుతుండడంతో ఏరువాక పండుగకు కాస్త కళ తప్పుతోంది. ఏరువాక వచ్చిందంటే రైతులు ఉత్సాహంగా పశువులను అందంగా అలంకరించి ఊరేగింపులు నిర్వహించేవారు. కానీ నేడు గ్రామాల్లో ఎక్కడో ఓ చోట మాత్రమే పశువులు కనిపిస్తున్నాయి.. ఈ సందర్భంగా రైతులు ఎక్కువ సంఖ్యలో హాజరై ఎద్దులను ప్రదర్శించారు. అలాగే పలువురు ఎద్దులతో పాటు బండ్లను కూడా అందంగా ముస్తాబు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎద్దులను పరిగెత్తించారు. ఎద్దుల ఊరేగింపు సమయంలో రైతులు సంబరాలు చేసుకున్నారు. ఊరేగింపు సందర్భంగా ఎద్దుల తాడును తెంపారు. దీంతో ఎద్దులు ఉరుకులు, పరుగులు తీసాయి. వాటి వెంబడి యువకులు, రైతులు ఉల్లాసంతో పరిగెత్తి సంబరాలు జరుపుకున్నారు. కోసిగి నాడుగేని వీధిలో మాజీ ఎంపిపి భీమక్క, నాడుగేని నాగరాజులు ఎద్దుల ఊరేగింపులో పాల్గొన్నారు.. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఏరువాక వేడుకలనుఘనంగా నిర్వహించారు..

**ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు:**
ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులు ఎద్దులకు స్నానం చేయించి పూజలు చేసారు. సాయంత్రం గ్రామాలలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు స్థానిక రేణుకా యల్లమాంబ దేవాలయం, ఇతర దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌రెడ్డి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసారు..

# వెంకట్ రెడ్డికి మెరుగైన చికిత్స అందించండి

**ఎమ్మెల్యే కోట్ల**



**డోన్ జూన్ 29 ప్రభాతవార్త :**
డోన్ సబ్ డివిజన్ పరిధిలోని ప్యాపిలి మండలం గుడిపాడు గ్రామం చెందిన వెంకటరెడ్డిని పాము కాటు వేయడంతో వారి కుటుంబ సభ్యులు డోన్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి చికిత్స చేస్తున్నారని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రికి తరలి వెళ్లి సూపరెంటెంట్ అనీఫ్ మాట్లాడి వెంకటరెడ్డి పరిస్థితి గురించి డాక్టర్ని అడిగి తెలుసుకుని వెంకటరెడ్డి పై వైద్యాధికారులు మెరుగైన చికిత్సలు అందించాలని డాక్టర్లకు ఆదేశించారు

# ప్రభుత్వ ఆసుపత్రి అకస్మిక తనిఖీ

**– రోగుల సమస్యలపై నేరుగా ఆరా : ఎమ్మెల్యే**



**ఆళ్లగడ్డ, జూన్ 29, ప్రభాతవార్త:**
ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరైన వైద్యం అందుతుందా? వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందిస్తున్నారా? మందులు అందుబాటులో ఉన్నాయా? ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోగులను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సంబంధిత వైద్యాధికారులకు సమస్యలు పరిష్కరించాలని అదేశాలు జారీచేసి లోపాలను సరిదిద్దాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, మందుల లభ్యత వైద్యుల సేవలు, రోగుల పట్ల సిబ్బంది వ్యవహారశైలిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

# ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం..!

**– కాలిపోయిన రెండు హోటళ్లు**
**– బాధితులకు రూ.3 లక్షలు నష్టం...**
**– ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి**

**మంత్రాలయం, జూన్ 29, ప్రభాతవార్త;**



నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో ప్రమాదవశాత్తు సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో రెండు హోటళ్లు పూర్తిగా కాలిపోగా, బాధితులకు రూ.లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లింది. వివరాల మేరకు.... మంత్రాలయం పట్టణానికి చెందిన రంగస్వామి, సున్నం రాఘవేంద్ర అనే ఇద్దరు వ్యక్తులు మఠం సమీపంలో ఉన్న తుంగభద్ర నదీతీరంలో రెండు హోటళ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే మధ్యాహ్నం సమయంలో ఆకస్మికంగా రెండు హోటళ్ల నుంచి మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న బాధితులు హోటళ్ల వద్దకు చేరుకుని స్థానికుల సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ మంటల్లో రంగస్వామికి చెందిన రెండు ఫ్రిజ్‌లు, కుర్చీలు, సరుకులు మొత్తం కాలి బూడిదయ్యాయి. బాధితునికి సుమారు రూ.2 లక్షలు నష్టం సంభవించింది. అదేవిధంగా సున్నం రాఘవేంద్రకు చెందిన హోటల్‌లో సుమారు రూ.లక్ష సామానులు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం ఇద్దరికి కలిపి రూ.3 లక్షలు దాకా ఆస్తినష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రైతుల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల ధ్వంసం

**: రూ. 3 లక్షల మేర నష్టం**

**వెల్దుర్తి, జూన్ 29, ప్రభాతవార్త :**
44వ జాతీయ రహదారి ప్రక్కన రైతులు నిర్మలమ్మ, బాల వెంకటరెడ్డి, అలా మోహన్ రెడ్డి లకు చెందిన 220 సర్వే నంబర్ లోని పొలంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వాటిలో రెండు పూర్తిగా ధ్వంసం చేసి, మరో ట్రాన్స్ఫార్మర్ లో ఇంధనాన్ని అపహరించారు. వీటితోపాటు గతంలో సైతం ఇదే ప్రాంతంలో విద్యుత్ తీగలు అపహరించారు. విషయంపై విద్యుత్ అధికారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు , విద్యుత్ తీగల అపహరణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




# క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తాం

**: స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నాకు అభినందనలు**

**: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**

**ఆత్మకూరు జూన్ 29 ప్రభాతవార్త :**



శ్రీశైలం నియోజకవర్గలో క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఇటీవలే జరిగిన విజయనగరం రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ క్రీడా పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో కె వి కె స్టేడియం లో అన్ని క్రీడల్లో శిక్షణ తీసుకొనే క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నామని తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ఆధ్వర్యంలో బాక్సింగ్ శిక్షణ ఇచ్చే శిక్షకుడు ఉపేంద్రను అభినందించారు. క్రీడాకారులకు జిల్లాస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి లో పాల్గొనేలా చేసే అహర్నిశలు ఉంటాయని క్రీడాకారులు కష్టపడి పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు